క్లుప్తంగా

తలనీలాల వేలం ఆదాయం రూ.1.25 లక్షలు


వేలం నిర్వహిస్తున్న ఈఓ కృష్ణనాయక్

కార్వేటినగరం: స్కంధ పుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో 28నుంచి నిర్వహించే వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన తలనీలాల వేలం పాటలో ఆలయానికి రూ.లక్ష 25 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కృష్ణనాయక్ తెలిపారు. ఈఓ మాట్లాడుతూ ప్రతి ఏటా భక్తులు స్వామివారికి సమర్పించే తలనీలాల వేలం పాటలో వచ్చే ఆధాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు.

ఆట పాటలతో విద్యాబోధన


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కార్వేటినగరం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఆటలు, పాటలు ఎంతో దోహదపడతాయని డీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. గురువారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆట, పాటల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈక్రమంలో భాగంగా విద్యార్థులు చూపరులు ఆకట్టుకునేలా బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలన, స్త్రీ సాధికారత అంశాలపై ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో అత్యంత ప్రతిభ కనబరిచిన రమ్య, లీన, మోక్షలను హెచ్‌ఎం అభినందించారు. పీఈటీ తిరుమలరాజు, ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, వెంకటరమణయ్య, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రంజిత్‌కుమార్, సరస్వతి, హరిత పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ స్థలం ఖరారు


స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు


పుత్తూరు: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో అన్నా క్యాంటీన్ నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు మున్సిపల్ ఏఈ కార్తికేయన్ తెలిపారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు గురువారం స్థలాన్ని చదును చేసినట్లు తెలిపారు. స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ పుత్తూరుకు అన్నా క్యాంటీన్ గ్రాంట్ కింద రూ. 62.1లక్షలు మంజూరైందని తెలిపారు. త్వరలోనే భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు, లక్ష్మీపతి, ధనపాల్, మురళీకృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తున్న రిటైర్డ్ టీచర్ చంద్రయ్య

విజయపురం: మండలంలోని మాధవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్ చంద్రయ్య, ఉపాధ్యాయులు దొరస్వామి కలిసి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో పాటు విద్యాసామగ్రి గురువారం వితరణ చేశారు. దాత మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని కోరారు. దాతలు అందించే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలు తప్పనిసరి


సమీక్షలో మాట్లాడుతున్న వైద్యులు

గంగాధర నెల్లూరు: టీబీ నివారణకు బీసీజీ టీకాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వేసుకోవాలని గంగాధర్ నెల్లూరు మండల వైద్యులు డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ ప్రవీణ్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండలంలోని వైద్యసిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు. కుష్ఠు వ్యాధిపై సర్వే, బీసీజీ టీకాల గురించి సమీక్ష నిర్వహించి రోగులను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలన్నారు. వైద్యులు డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శైల ధర్మేంద్ర ఏఎన్‌ఎంలు ఏంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలరోజులైనా పెట్టుబడి సాయం గురించి పట్టించుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఇంతవరకు ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు మరిన్ని కష్టాలు తప్పవేమోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఫలితంగా సాధారణ సాగు విస్తీర్ణంలో ఈ సారి 30 శాతం మాత్రం సాగవుతోంది.



ఖరీఫ్ సేద్యం.. 30 శాతం!

- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- పెట్టుబడి సాయంపై సర్కారు మౌనం
- ఆందోళనలో రైతాంగం
- పంటల సాగు అంతంతమాత్రమే

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు డివిజన్ పరిధిలో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఖరీఫ్ సీజను పంటల సాగుకు ముందస్తుగా పెట్టుబడి సాయం అందివ్వడంలో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. కేవలం వర్షాధార పంటగా వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సాధారణ విస్తీర్ణంలో కేవలం వేరుశనగ మినహా ఇతర పంటలు మొత్తం 30 శాతం మేరకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు.

చిత్తూరు డివిజన్ పరిధిలో చిత్తూరు, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలు వస్తాయి. ఈ మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాలేదు. అడపాదడపా కురిసిన వర్షానికి మాత్రమే రైతులు కొంతమేరకు పంటలను సాగులోకి తీసుకు రాగలిగారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ సీజను ప్రారంభంలోనే రైతు భరోసా పథకం కింద పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని అందించేది. దీంతో రైతులు పంటల సాగును ఉత్సాహంగా చేపట్టేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం అందించేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించిన పీఎం కిసాన్ కింద ప్రతి రైతుకు రూ.2 వేలు మాత్రమే చేతికందింది. దీంతో రైతులకు పంటల సాగు కష్టతరంగా మారింది. ఫలితంగా మొత్తం సాధారణ విస్తీర్ణంలో కేవలం 30 శాతం మేరకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు.


పెనుమూరు మండలంలో సాగవుతున్న చెరకు పంట


కార్వేటినగరం మండలంలో వేరుశనగ పంట సాగు

సాగు ఇలా...

డివిజన్ పరిధిలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 25,984 హెక్టార్లకు గాను ప్రస్తుతం 8,838 హెక్టార్ల మేరకు మాత్రమే రైతులు అన్ని రకాల పంటలను సాగు చేశారు. అందులో అత్యధికంగా వర్షాధార పంటగా వేరుశనగను మొత్తం 15,833 హెక్టార్లకు గాను 4,198 హెక్టార్లలో, వరి 1,847 హెక్టార్లకు గాను 723 హెక్టార్లలో, చెరకు 3,180 హెక్టార్లకు గాను 1,074 హెక్టార్లలో సాగు చేయగా ఇతర పంటలను 2,843 హెక్టార్లలో సాగు చేశారు. దీన్ని బట్టి చూస్తే కేవలం వర్షాధార పంటగా వేరుశనగను మాత్రమే అత్యధికంగా సాగులోకి తీసుకువచ్చారు. సాగు నీటి ఆధారిత పంటలను అంతంత మాత్రంగానే సాగు చేశారు.

కొత్త రుణాల జాడేది?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం నెలకొంది. ఈ కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. దీంతో సేద్యం పనుల కోసం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. చాలా మంది ఈ అధిక వడ్డీల భారం మోయలేక అసలు వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. మరి కొందరు రైతన్నలు ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. అన్నదాత సుఖీభవ అంటూ పథకం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ పెట్టుబడి సాయం అందించడంలో చూపించలేదు. దీంతో అన్నదాతకు గడ్డుకాలం ఎదురవుతోంది.

చిత్తూరు డివిజన్ పరిధిలో సాగు ఇలా..

మొత్తం సాగు విస్తీర్ణం	-	25,984 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	8,838 హెక్టార్లు
వేరుశనగ సాగు విస్తీర్ణం	-	15,833 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	4,198 హెక్టార్లు
ఇతర పంటల సాగు విస్తీర్ణం	-	10,151 హెక్టార్లు
సాగైన విస్తీర్ణం	-	4,640 హెక్టార్లు
సాగుకు నోచుకోని విస్తీర్ణం	-	17,146 హెక్టార్లు

అంబేడ్కర్ యువజన సంఘం ర్యాలీ

నగరి : సమతా నాయకుడు ఆమ్‌స్ట్రాంగ్‌ను చెన్నైలో ఇటీవల దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి నివాళులర్పించి అక్కడి నుంచి ఓంశక్తి ఆలయం సర్కిల్ వరకు భారీ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎంకే ప్రకాష్ మాట్లాడుతూ బీఎస్పీ నాయకుడిని అతికిరాతకంగా నరికివేసినా తమిళనాడు ప్రభుత్వం ఇంతటి వరకు నిజమైన దొంగలను పట్టుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. బీసీకే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి బాల సింగం మాట్లాడుతూ హంతకులను పట్టుకునే వరకు పోరాటం సాగుతుందన్నారు. ఈ ర్యాలీలో ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జాతీయ కార్యదర్శి డి.గోవిందస్వామి, జిల్లా అధ్యక్షులు వేలాయుధం, తిరుపతి జిల్లా అధ్యక్షులు మహేష్, బీఎస్పీ నాయకులు నగరి ఇన్చార్జి నాగూర్ సత్యవేడు ఇన్చార్జి ధన, కాకావేడు, గుండ్రాజుకుప్పం, సత్రవాడ అధ్యక్షులు బాలవర్ధన రాజు, విజయచందర్, ఉమాపతి, న్యాయవాదులు బాబు, నాగరాజు, నాయకులు జభరాజు, మైలు స్వామి, సందీప్, శశి, నాగరాజు, మధు, బాలాజీ, సత్యరాజ్, రాజా, కార్తీ, వీసీకే పార్టీ సభ్యులు పాల్గొన్నారు.


ర్యాలీలో అఖిలపక్ష నాయకులు

దివ్యాంగులకు అన్నదానం

నగరి : స్థానిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు వారు అన్నదానం చేశారు. గురువారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకుని అందరికీ విందు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఇ.ప్రభాకర్ రెడ్డి, ట్రస్టీలు ఇ.ప్రభాకర్ రెడ్డి, టి.మోహనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం : మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో నిర్మించిన డ్రైనేజీ కాలువలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను అధికారులు తొలగించారు. 'సాక్షి' పత్రికలో గురువారం కాలువలో కదలని మురుగు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే మురికి కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు.


పిచ్చి మొక్కలను తొలగించిన దృశ్యం

నగరిలో విభిన్న వాతావరణం

నగరి : పట్టణంలో గురువారం భిన్నవాతావరణం చోటుచేసుకుంది. మధ్యాహ్నం వేసవిని తలపించిన వాతావరణం సాయంత్రం అకస్మాత్తుగా మబ్బులు కమ్ముకుని జోరువర్షం కురిసింది. పాఠశాలలు, ఉద్యోగులు తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో అకస్మాత్తుగా వర్షం రావడంతో ఇళ్లకు చేరుకునేందుకు అవస్థలు పడ్డారు.

ఆగస్టు 15న మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

నగరి : స్వాతంత్ర్య దినోత్సవం రోజున గిరిజన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ విష్ణువర్మ నగరి, నింద్ర, విజయపురం మెడికల్ సూపరింటెండెంట్లకు గురువారం లేఖ ద్వారా తెలియజేశారు. రాష్ట్ర, జిల్లా లీగల్ కమిటీల ఆదేశానుసారం, నల్సా–2015 పథకం కింద ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సమన్వయంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటలకు నింద్ర మండలం వేదాంతపురం ఎస్టీకాలనీలో, ఉదయం 9 గంటలకు విజయపురం మండలం ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో, ఉదయం 10 గంటలకు నగరి నత్తం కండ్రిగ ఎస్టీ కాలనీలో మెడికల్ క్యాంపులను ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ


అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ

పాలసముద్రం: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీహెచ్‌ఓ జ్ఞాన శేఖర్, సూపర్వైజర్ మురళి అన్నారు. గురువారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ వినాయకం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఎం గంగాగౌరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహార తోటలు పెంచాలి

కార్వేటినగరం: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణంలో పోషకాలు అందించే తోటల పెంపకాన్ని విధిగా చేపట్టాలని రాస్–కృషివిజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పెద్ద దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార తోటల పెంపకంపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందించే తోటలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించడమే కాకుండా మంచి పోషక విలువలు కలిగిన కూరగాయలను అందుబాటులోకి తీసుకురావడమే రాస్ -కృషి విజ్ఞానకేంద్రం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. డాక్టర్ ఏబీ శ్రీలత పోషకాహార తోటలు పెంచుకునే విధానం, వివిధ కూరగాయలు, ఆకు కూరలను సేంద్రియ పద్ధతిలో పెంచే విధానాన్ని వివరించారు. మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

పుత్తూరు: చేతి వృత్తుల్లో శిక్షణతోపాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ హరిత పేర్కొన్నారు. స్థానిక రాస్ కార్యాలయంలో శుక్రవారం రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు కుట్టు మిషన్లను హరిత పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రూ.1.75 లక్షల విలువైన కుట్టు మిషన్లు రాస్ సంస్థ అందివ్వడం హర్షణీయమన్నారు. రుణాలు మంజూరు చేస్తూ, వివిధ రంగా ల్లో శిక్షణ ఇస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగా నో దోహదపడుతున్నారని కొనియాడారు. మహిళ లు ఈ అవకాశాన్ని సద్వినియోగం తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, శోభారాణి, ప్రకాష్, శేఖర్, దివాకర్, జయంతి పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న బ్యాంకు మేనేజర్ హరిత

అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచాలి

విజయపురం : గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించి, అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మండలంలో గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్స్, మధ్యాహ్నం భోజనం పథకం, అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచాలని, మహిళా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సుమారు 25 నెలలు పెండింగ్‌లో ఉన్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులు జీతాలు వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, మధ్యాహ్న భోజనం పథకం జిల్లా సహాయ కార్యదర్శి పరిమళ, గ్రీన్ అంబాసిడర్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ పాము, యేసు పాదం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

మండల సమావేశం రేపు

వెదురుకుప్పం: ఈనెల 27న శనివారం ఉదయం 10.30 గంటలకు వెదురుకుప్పంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మహిళలు సుస్థిర జీవనోపాధి చూసుకోవాలి

పాలసముద్రం: ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు కూడా సుస్థిర జీవనోపాధి చూసుకుని, ప్రతినెలా స్థిరమైన ఆదాయం వచ్చేటట్లు ప్రణాళిక వేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సీసీ చిరంజీవి, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం: సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి జే.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మంగుంట గ్రామంలో పొలంబడి కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి జె.మురళీకృష్ణ హాజరయ్యారు. రైతులతో ఆయన మాట్లాడుతూ లాభసాటి దిగుబడి సాధించాలంటే వేపగింజల కషాయం, కానుగ ఆకుల కషాయం, జీవామృతం వంటి పిచికారీ ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. క్రిమి సంహారక రసాయన మందులు వాడడం ద్వారా పర్యావరణ కాలుష్యంతో పాటు మనుషుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం గ్రామంలో శేషాద్రి, రూప రైతులు సాగుచేసిన ప్రకృతి వ్యవసాయం క్షేత్రాన్ని సందర్శించి వారిని ఆయన అభినందించారు. ఏడీ సౌభాగ్య లక్ష్మి, మండల వ్యవసాయాధికారి నర్మద, సచివాలయం, వ్యవసాయ సహాయకులు ఢిల్లీప్రసాద్, భరత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగుచేసి బెల్లం తయారు చేస్తే టీటీడీకి సరఫరా చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో చేసిన చెరకు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు, వ్యవసాయ సహాయకులు వనజ పాల్గొన్నారు


సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

అబ్బురపరిచిన గణిత అష్టావధానం

చిత్తూరు కలెక్టరేట్: సర్కారు బడిలో చదివే విద్యార్థులు నిర్వహించిన గణిత అష్టావధానం అబ్బురపరిచిందని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. ఆ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, గణిత ఫోరంల సయుక్త నిర్వహణతో గురువారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గణితావధానం తిలకించే విద్యార్థుల్లో ఆలోచనా విధానం మారుతుందని తెలిపారు. గణితావధాని అరుణశివప్రసాద్ మాట్లాడుతూ బంగారుపాళ్యం మండలం జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థుల బృందం ఎన్నో గణిత అష్టావధానం కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. అనంతరం గణిత అష్టావధానంలో పాల్గొన్న విద్యార్థులు తమదైన శైలిలో డిగ్రీ కళాశాల విద్యార్థులను అబ్బురపరిచారు. పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక కార్యదర్శి సుధాకర్, లయన్స్‌క్లబ్ సభ్యులు శ్రీధర్, పాపుదేశి ఫౌండేషన్ సభ్యులు జయంతి, మొగిలయ్య, కళాశాల అధ్యాపక బృందం డా.జి.ఉషారాణి, రమాదేవి, వినీల, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.